
సిరిసిల్ల టౌన్ : శివాలయంలో దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు


ఎల్లారెడ్డిపేటలో దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులు


బోయినపల్లి : రత్నంపేట ఆలయం వద్ద భక్తులు


కోనరావుపేట: శివకల్యాణంలో పాల్గొన్న భక్తులు

మార్మోగిన శివనామస్మరణ

సిరిసిల్ల టౌన్/సిరిసిల్లకల్చరల్/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/రుద్రంగి/బోయినపల్లి/ ఇల్లంతకుంట: హరహర మహాదేవ... శంభోశంకరా.. అంటూ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. మహా శివరాత్రి సందర్భంగా బుధవారం శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ నియోజవర్గాల్లో ఆయాగ్రామాల్లో శివకల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని శివకల్యాణాన్ని తిలకించారు. ఆలయాల్లో రుద్రాభిషేకం, రుద్రహవనం, అభిషేకం, బిల్వార్చన, మహాలింగార్చన, లింగోద్భవ తదితర పూజలు నిర్వహించారు. శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శైవ క్షేత్రాలన్నీ, భక్తులతో బారులు తీరాయి. ఆలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేటలోని మార్కండేయ ఆలయంలో స్వామివారి కల్యాణం


సిరిసిల్ల టౌన్ : శివనగర్ ఆలయంలో శివలింగానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు


సిరిసిల్లకల్చరల్: శివలింగానికి జలాభిషేకం చేస్తున్న భక్తులు


వీర్నపల్లి : శివపార్వతుల శోభాయాత్ర


సిరిసిల్లకల్చరల్: దర్శనం కోసం క్యూలైన్‌లో నిల్చున్న ప్రజలు


కోనరావుపేట: నిజామాబాద్‌లోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఇల్లంతకుంట : జంగారెడ్డిపల్లె రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు


తంగళ్లపల్లిలో క్యూలైన్‌లో భక్తులు


ఎల్లారెడ్డిపేటలో స్వామివారి కల్యాణం..


రుద్రంగి : బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

క్లుప్తంగా

గాజులు కొనుగోలు చేసిన కవిత


గాజులు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు బుధవారం వచ్చిన ఎమ్మెల్సీ కవిత బద్దిపోచమ్మ వీధిలోని ఓ గాజుల దుకాణంలో గాజులు కొనుగోలు చేశారు. అమ్మవారి గుర్తుగా చెప్పుకునే గాజులను ఆమె కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది


ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. ఇల్లంతకుంట పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సెక్టర్ అధికారి కిషోర్ బుధవారం పరిశీలించారు. పోలింగ్‌స్టేషన్ పీవోలను ఎన్నికల సామగ్రి గురించి అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏదైనా గుర్తింపుకార్డును తమ వెంట తెచ్చుకోవాలన్నారు.

రుద్రంగి: రుద్రంగిలోని జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రానికి పోలింగ్ సిబ్బంది బుధవారం చేరుకున్నారు. రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

బోయినపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది బోయినపల్లి పోలింగ్ స్టేషన్‌కు చేరుకున్నారు. మండలంలో 23 గ్రామాలు ఉండగా, బోయినపల్లి హైస్కూల్‌లో పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఓ, ఏపీఓలతో పాటు మొత్తం 11 మంది ఎన్నికల సిబ్బంది వచ్చారు. ఏఎస్సై మోతీలాల్ తదితరులు ఉన్నారు.


బోయినపల్లి పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికల సిబ్బంది

అక్రమ నిర్మాణం కూల్చివేత

- అనుమతులు లేని నిర్మాణాలపై అధికారుల కొరడా
- మూడు రోజుల్లో మూడు నేలమట్టం

ఎల్లారెడ్డిపేట: అనుమతులు లేని అక్రమ నిర్మాణాలపై అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో మూడు రోజుల వ్యవధిలో అనుమతులు లేని మూడు నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో అక్రమ నిర్మాణదారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తాజాగా బుధవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన గల విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీని ఆనుకొని నిర్మిస్తున్న రేకులషెడ్డును ఎంపీవో రాజు ఆధ్వర్యంలో కూల్చివేశారు. ఎంపీవో జోగం రాజు మాట్లాడుతూ మండలంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు.


నిర్మాణానికి వినియోగించిన సిమెంట్ ఇటుకల తొలగింపు



అధ్వానంగా రోడ్డు

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లి నుంచి చందుర్తి మండలం ఎన్గల్ గ్రామానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. రెండు మండలాలను కలిపే ఈ రోడ్డును తారురోడ్డుగా మార్చాలని కొన్నేళ్లుగా ప్రజలు కోరుతున్నా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ఇదే దారిలో ఒర్రె ఉండడంతో వర్షాకాలంలో నీరు ప్రవహించి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

తండా బడి ఉండేనా..!



ముస్తాబాద్: మండలంలోని సేవాలాల్‌తండా ధరంసోత్ తండా ప్రాథమిక పాఠశాల భవనం చుట్టూ పెద్దఎత్తున మట్టిని తరలించుకుపోయారు. ఇటీవలే పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, మరో పాఠశాలకు విద్యార్థులను పంపిస్తున్నారు. పాఠశాలలో ఎవరూ లేకపోవడంతో జేసీబీతో భవనం చుట్టూ మట్టిని తవ్వి తరలించుకుపోయారు. దీంతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో వరదనీరు నిలిచి భవనం పడిపోయే ప్రమాదం పొంచి వుంది. అలాగే ధరంసోత్ తండా, రాగంపల్లెలో విద్యార్థుల సంఖ్య పెరిగితే ఈ పాఠశాలను తిరిగి ఓపెన్ చేసుకోవచ్చు. అప్పుడు విద్యార్థుల పరిస్థితి ఏంటని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవలే ఓ రోడ్డు పనులకు పాఠశాల చుట్టూ ఉన్న మట్టిని తరలించుకెళ్లారని, గిరిజనులు పేర్కొన్నారు. దీనిపై ఎంఈవో రాజిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల చుట్టూ మట్టిని తీసిన వ్యక్తులపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు నివేదించామన్నారు.

పండుగపూట విషాదం


మురళి (ఫైల్)

కోనరావుపేట: మండలంలోని ధర్మారంలో పండుగపూట విషాదం నెలకొంది. మహాశివరాత్రి వేళ గుండెపోటుతో ఒకరు మృతిచెందారు. గ్రామానికి చెందిన వేములవాడ మురళి(75) మహాశివరాత్రి జాగరణ కోసం అవసరమైన సరుకులను మంగళవారం తెచ్చుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతునికి భార్య మంగవ్వ ఉంది. వీరికి సంతానం లేకపోవడంతో భార్య మంగవ్వనే భర్తకు అంత్యక్రియలు నిర్వహించింది. ధర్మారంలో రెండు రోజుల్లో ఇద్దరు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన పొట్ల రాకేశ్(18) మృతిచెందగా మంగళవారమే అంత్యక్రియలు నిర్వహించగా, బుధవారం మురళి మృతితో గ్రామంలో విషాదం అలుముకుంది.

చెట్టును ఢీకొన్న కారు


నుజ్జునుజ్జయిన కారు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలో ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. కరీంనగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు వేములవాడ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా వేములవాడ - కరీంనగర్ ప్రధాన రహదారిలో అదుపుతప్పి కారు చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గంభీరావుపేట మండలం నాగంపేటకు చెందిన నాగరాజు, మారం విజయ్ బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో తిమ్మాపూర్ శివారులో ఎదురుగా వస్తున్న వాహనం లైట్లకు దారి కనిపించక ప్రమాదానికి గురయ్యారు. రోడ్డు పక్కకు వాహనం దూసుకెళ్లి నాగరాజు మీద పడడంతో అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులు ఇద్దరిని సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు.

కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గాయత్రి పరివార్ సభ్యులు

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ శ్రీగాయత్రీ ఆశ్రమంలో శివరాత్రి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకుడు బాదం ప్రకాశ్ ఆధ్వర్యంలో మహాశివుడికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఏప్రిల్ 26న అగ్రహారంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న 2,400 ప్రమిదల దీప మహాయజ్ఞం, 27న జరిపే 108 కుండలములతో గాయత్రి మహాయజ్ఞం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. గాయత్రి పరివార్ సభ్యులు బొమ్మవరం లింగారావు, రాపెల్లి ఆనందం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పర్సు అప్పగింత


భక్తురాలికి పర్సు అప్పగిస్తున్న పోలీసులు

వేములవాడ: మహా శివరాత్రి జాతరకు వచ్చిన నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అంకుసాపూర్‌కు చెందిన బోడ రాజవ్వ అనే భక్తురాలు ధర్మగుండం వద్ద తన పర్సు పోగొట్టుకుంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న తాడెం స్వామి, బండ అనిల్ అనే కానిస్టేబుళ్లు పర్సును వెతికి ఆమెకు అందజేశారు. పర్సులో రూ.5,900 ఉన్నట్లు భక్తురాలు బోడ రాజవ్వ తెలిపింది. ఈ సందర్భంగా పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణులపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై ఉన్న తాత్కాలిక వంతెన వర్షాలకు కొట్టుకుపోయింది. ఈ వాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల ప్రజలు కోరుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏటా వానాకాలంలో తాత్కాలిక వంతెన తెగిపోవడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మానేరు వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : కిరణ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సెల్‌నంబర్ : 944 081 8864

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626